# రయ్.. రయ్..

## దూసుకొస్తున్న బైక్ రేసర్లు

- వీలింగ్, స్టంట్లతో రెచ్చిపోతున్న వైనం
- వాహనాలకు నంబర్ ప్లేట్లు కూడా ఉండని దుస్థితి
- మైనర్లే అధికం
- బెంబేలెత్తుతున్న ఇతర వాహనదారులు, స్థానికులు


కొట్నూరు వద్ద బైక్ వీలింగ్ చేస్తున్న దృశ్యం

**గుంపులుగా..**

ఆదివారం వచ్చిందంటే హిందూపురం పరిసర ప్రాంతాల్లో హైవేలపై యువత ద్విచక్రవాహనాలతో ఒంటి చక్రంపై నడిపి విన్యాసాలు చేస్తున్నారు. గుంపులుగుంపులుగా వాహనాల్లో పోటాపోటీగా వెళ్తున్నారు. వారి వేగానికి అటుగా వెళ్లేవారు, పరిసర ప్రాంతాల ప్రజలు భయపడి దూరం జరుగుతున్నారు. అది చూసి తమను చూసి భయపడుతున్నారని కేరింతలు కొడుతున్నారు. దాంతో మరింత రెచ్చిపోతున్నారు బైక్ రేసర్లు.

ఆదివారం వచ్చిందంటే.. హిందూపురం పరిసర ప్రాంతాల్లో రహదారులపైకి బైక్ రేసర్లు వచ్చేస్తున్నారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతున్నారు. వీలింగ్, స్టంట్లతో రెచ్చిపోతున్నారు. సెకన్ల వ్యవధిలో దూసుకొస్తున్నారు. వారిని చూసి ఇతర వాహనదారులు, స్థానికులు బెంబేలెత్తుతున్నారు. ఓవైపు వారు ఎక్కడ కింద పడిపోతారోనని, మరోవైపు తమ వాహనాలను ఎక్కడ ఢీకొడతారోనని బెంబేలెత్తుతున్నారు. బైక్ రేసర్లలో చాలావరకు మైనర్లే ఉంటుండడం ఆందోళన కలిగించే విషయం. ఒక్కో వాహనంపై ముగ్గురు, నలుగురు కూడా ఎక్కి స్టంట్లు చేస్తున్నారని పట్టణవాసులు వాపోతున్నారు. వారిని కట్టడి చేయడంలో పోలీసులు విఫలమవుతున్నారన్న విమర్శలు మూటగట్టుకుంటున్నారు.

హిందూపురం అర్బన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిసర ప్రాంతాల్లో రహదారులపై బైక్ రేసర్లు ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఏడాది క్రితం బైక్ రేసర్ ఢీకొని చిన్నారి ఆద్య ప్రాణాలు కోల్పోయింది. ఆ సమయంలో పట్టణ వాసులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బైక్ రేసింగ్‌లపై చర్యలు తీసుకోవాలని ఉద్యమాలే చేశారు. అయినా.. బైక్ రైడర్లలో మార్పులేదు. బైక్‌లతో విన్యాసాలు చేస్తూ.. ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఖరీదైన బైక్‌లతో రోడ్లపైకి వస్తున్నారు. ప్రజలను భయభ్రాంతులను లోనుచేస్తున్నారు. వారి వాహనాలకు కనీసం నంబర్ ప్లేట్లు కూడా ఉండవు.

### పోలీసులకు సవాల్

పోలీసులంటే బైక్ రేసర్లకు భయంలేదు. పోలీసులు చూస్తున్నా ఖాతరు చేయకుండా దూసుకుపోతున్నారు. త్రిబుల్ రైడింగ్ సైతం చేస్తున్నారు. కనీసం వారికి వాహనం నడిపేఅర్హతకూడా ఉండదు. చాలావరకు మైనర్లే ఉంటున్నారు. వారిలో కూడా విద్యార్థులే ఎక్కువగా ఉంటుండడం గమనార్హం. పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో బైక్ రేసర్లకు అడ్డేలేకుండా పోతోంది.

### తల్లిదండ్రులు కీలకం

పిల్లలకు బైక్‌లను కొనిస్తున్న తల్లిదండ్రులు వారు ఎలా నడుపుతున్నారో కనిపెట్టుకుని ఉండాలి. అసలు మైనర్లకు బైక్ ఇవ్వకూడదు. అయినా.. తల్లిదండ్రులు.. వారికి బైక్‌లు ఇస్తున్నారు. అవగాహన రాహిత్యంతో వారు డ్రైవింగ్ చేస్తూ.. వారి ప్రాణాలతోపాటు ఇతరుల ప్రాణాలను సైతం రిస్క్‌లో పెడుతున్నారు. ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. వారి కుటుంబాల్లో అంతులేని శోకం నింపుతున్నారు.

**ఐదుగురిని అదుపులోకి తీసుకున్నాం**

కొడికొండ చెక్‌పోస్టు నుంచి శిరా వెళ్లే రహదారిపై పట్టణ పరిధిలోని కొట్నూరు బ్రిడ్జి వద్ద ఆదివారం బైక్ రేసింగ్ చేస్తున్నట్లు సమాచారం అందిన వెంటనే సిబ్బందిని పంపాం. బైక్ రైడింగ్ చేస్తున్న సమయంలో వాహనాలు ఆపి, ఐదుగురిని అదుపులోకి తీసుకున్నాం. మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నాం. వాహనదారుల తల్లిదండ్రులను పిలిపించి, కౌన్సెలింగ్ ఇస్తాం. చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. బైక్‌లను సీజ్ చేస్తాం.

- రాజగోపాలనాయుడు, వన్‌టౌన్ సీఐ

## అలరించిన సంగీత కచేరి



సంగీత కచేరి నిర్వహిస్తున్న విదేశీ భక్తులు

క్రిస్మస్ వేడుకల్లో భాగంగా స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో ఆదివారం సాయంత్రం విదేశీ భక్తులు సంగీత కచేరితో అలరించారు. విదేశీ భక్తురాలు అనాలువే బృందం సంగీతంతో మైమరపింపజేసింది. మొదట గౌరీ పుత్ర వినాయకం పేరిట భక్తిగీతాన్ని ఆలపించారు. అనంతరం పాశ్చాత్య సంగీతాన్ని వినిపించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. -ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి

## విద్యార్థుల జవాబు పత్రాలు దహనం




దుండగులు దహనం చేసిన జవాబు పత్రాలు, ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రత్న

ఓబుళదేవరచెరువు, డిసెంబరు22(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోకి ఆదివారం తెల్లవారుజామున దుండగులు చొరబడ్డారు. ఉపాధ్యాయుల స్టాఫ్ రూమ్‌లోకి వెళ్లి, విద్యార్థుల జవాబు పత్రాలను దహనం చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ఉపాధ్యాయుల స్టాఫ్ రూమ్ తలుపు గడిని కట్ చేసి, లోపలికి ప్రవేశించారు. విద్యార్థులు రాసిన ఎఫ్-1, 2, ఎస్ఏ 1 జవాబు పత్రాలతోపాటు ఉపాధ్యాయులు లెసన్ ప్లాన్లను దహనం చేశారు. ఉదయాన్నే పాఠశాల వాచ్‌మన్ గుర్తించి, హెచ్ఎం శోభారాణికి సమాచారం అందించాడు. హెచ్ఎం సమాచారంతో ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పాఠశాలకు చేరుకుని, పరిశీలించారు. అనంతరం ఎస్పీ రత్న పాఠశాలకు చేరుకున్నారు. హెచ్ఎం, ఉపాధ్యాయులను విడివిడిగా విచారించారు. హెచ్ఎం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఘటనా ప్రాంతంలో వేలిముద్రలు సేకరించారు. ఎస్పీ వెంట డీఎస్పీ విజయకుమార్, ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఉన్నారు.

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనతో భరోసా

- కరువుతోపాటు విపత్తుల్లోనూ ప్రయోజనం
- నెలాఖరు వరకే గడువు


సాగు చేసిన వరిపంట

ఎకరానికి బీమా వివరాలు

| పంట | రైతువాటా | ప్రీమియం(రూ.) | బీమా(రూ.) |
|---|---|---|---|
| వరి | 0.40 శాతం | 215 | 43,000 |
| మొక్కజొన్న | 0.30 శాతం | 105 | 35,000 |
| శనగలు | 1.15 శాతం | 368 | 32,000 |

# పంటకు బీమా.. రైతుకు ధీమా..!

ధర్మవరం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పేరిట రైతులు సాగుచేసిన పంటలకు బీమా సౌకర్యాన్ని కల్పిస్తోంది. మరో వారం రోజుల్లో గడువు ముగియనుంది. రబీసాగుకు సమాయత్తమవుతున్న ప్రస్తుత తరుణంలో బీమా పథకం సద్వినియోగంపై వ్యవసాయాధికారులు మరింత చైతన్యం తీసుకురావాల్సి ఉంది. ప్రకృతి వైపరీత్యాలతో పంటనష్టం జరిగినప్పుడు రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది. కేంద్ర ప్రభుత్వం 2016 నుంచి ఈ పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. పథకంలో లబ్ధి పొందేందుకు కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ) సెంటర్లు, ఈ సేవ పోర్టలలో ప్రభుత్వం నిర్ణయించిన ధర మేరకు రైతులు సాగుచేసిన పంటలకు వాటాగా నగదును చెల్లించి నమోదు చేయించుకోవాలి.


### బీమా పొందొచ్చు ఇలా...

ప్రకృతి వైరీత్యాలు, చీడపీడల కారణంగా పంటలు దెబ్బతిన్నప్పుడు ప్రభుత్వం నిర్ణయించిన జిల్లా, మండలం, గ్రామం యూనిట్ ప్రాతిపదికన బీమా చేయించుకున్న రైతులకు నష్టపరిహారం పొందే అవకాశం ఉంటుంది. బీమా కోసం ఎంపిక చేసిన పంటలకు బ్యాంకుల నుంచి రుణాలు పొందిన రైతులకు ఆయా బ్యాంకులు కూడా బీమాను నమోదు చేస్తున్నాయి. రుణాలు తీసుకోని, కౌలు రైతులు ఫసల్ బీమా చేయించుకోవాలంటే దరఖాస్తు పూర్తి చేసి సంబంధిత పత్రాల ద్వారా సీఎస్‌సీలలో బీమా చేయించుకోవాలి.

### పథకంలో ప్రధాన అంశాలు..

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో రబీ సీజన్‌లో సాగుచేసిన వరి, మొక్కజొన్న పంటలకు ప్రభుత్వం నిర్ణయించిన ధర చెల్లించాలి. ఇదే బీమా పథకంలో శనగలు, మినుములు, మిర్చి, జొన్న పంటలకు కూడా వర్తింపచేసేలా ఆదేశాలు జారీ అయ్యాయి. పంట సాగు చేసిన తరువాత బీమా చేయించుకునేందుకు తప్పని సరిగా ఈ క్రాప్ నమోదై ఉండాలి. అనుమతించిన మీ సేవ, సీఎస్సీ కేంద్రాల ద్వారా ఈ పథకంలో చేరవచ్చు. పంటకోతల తరువాత పొలంలో ఆరబెట్టిన పంటలకు వర్షాల వల్ల నష్టం జరిగినప్పుడు అధికారులు వేసిన అంచనా మేరకు పరిహారం అందిస్తారు.

**గడువు పొడిగిస్తే ప్రయోజనం: పక్కీర్‌రెడ్డి, తాడిమర్రి**


2016లో ఈ పథకం వచ్చినా సరైన అవగాహన లేని కారణంగా ఇంకా చాలామంది రైతులు బీమా చేయించుకోలేదు. ప్రస్తుతం అధికారులు అవగాహన కల్పిస్తున్నా బీమా చేయించుకునేందుకు నెలాఖరు వరకే గడువు ఉంది. రబీ వ్యవసాయ పనులు ఇప్పుడిప్పుడే ప్రారంభమవుతున్నాయి. జనవరి నెలాఖరు వరకూ గడువు పొడిగిస్తే రైతులకు ఎంతో ఉపయోగం.

**అవగాహన కల్పించాలి: చంద్రశేఖర్, కొత్తచెరువు**


కేంద్రప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పేరిట రైతులు సాగుచేసిన పంటలకు బీమా సౌకర్యాన్ని కల్పించడం మంచిదే. ఈ బీమాపై అధికారులు అవగాహన కల్పించాలి. ఈ పథకానికి బీమా ప్రీమియం చెల్లిస్తే ఎంతో ఉపయోగం. పంట నష్టపోయినప్పుడు తప్పని సరిగా అధికారులకు తెలియజేసి అంచనా వేయించుకోవాలి.

## మరొకరి మృతి

**ఐదుకు చేరిన రోడ్డు ప్రమాద మృతుల సంఖ్య**


సుజాతమ్మ (ఫైల్)


మడకశిరటౌన్/గుడిబండ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బుళ్లసముద్రం వద్ద శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతిచెందగా ఆదివారం తెల్లవారుజామున తుమకూరులో చికిత్స పొందుతూ కుంబరనాగేపల్లికి చెందిన ఉపాధ్యాయురాలు సుజాతమ్మ(50) కన్నుమూశారు. తుమకూరు ఆసుపత్రిలో నాగమణి, గీతమ్మ, శ్రీదేవి, గిరిజమ్మ, రవీంద్రకు చికిత్స అందిస్తున్నారు. వీరి పరిస్థితి విషమంగా ఉంది. మరో నలుగురు చిన్నపాటి గాయాలతో చికిత్స పొంది డిశ్చార్జ్ అయి ఇంటికి వచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గుడిబండ మండలం హిరేతుర్పి ప్రాథమిక పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్న సుజాతమ్మ మృతి చెందడంతో ఆ ఊరితో సైతం విషాదఛాయలు అలుముకున్నాయి. ఉపాధ్యాయురాలు మృతిచెందారన్న విషయం తెలిసిన వెంటనే గ్రామంలో పలువురు విచారం వ్యక్తం చేశారు. తుమకూరు ప్రైవేట్ ఆసుపత్రి నుంచి మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి మృత దేహాన్ని తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సుజాతమ్మ మృతికి సంతాపం తెలుపుతూ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు శ్రీకాకుళం జిల్లాలో ఎంబీబీఎస్ చదువుతున్నాడు. కుమార్తె కేరళ రాష్ట్రంలో ఇంజనీరింగ్ చదువుతోంది. ఒకే కుటుంబంలో నలుగురు మృతిచెందడంతో గ్రామంలో ఒక్కసారిగా విషాద ఛాయలు అలుముకున్నాయి. కేఎన్ పల్లిలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు.

మొక్కజొన్నకు కత్తెర పురుగు

# ముప్పు

**సస్యరక్షణ చర్యలు చేపట్టకపోతే నష్టమే**

కత్తెర పురుగు సోకడంతో వాడిపోయిన మొక్కజొన్న పైరు



మొక్కజొన్న పంట

చిలమత్తూరు, డిశంబరు 22(ఆంధ్రజ్యోతి): రబీలో బోరుబావుల ఆధారంగా సాగుచేసిన మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు ముప్పు పొంచి ఉంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో బోరుబావుల కింద ఇప్పటికే సుమారు 985 ఎకరాల్లో మొక్కజొన్న పంట పెట్టారు. కలుపుతీత పూర్తవుతున్న దశలోని పంటకు విపరీతంగా కత్తెరపురుగు సోకింది. దాంతో పచ్చని పైర్లు తెల్లబారి వాడిపోతున్నాయి. రోజురోజుకీ పంటలో పురుగు ఉధృతి అధికమవుతుండడంతో పైర్లు ఒక్కొక్కటిగా నేలరాలుతున్నాయి. దీంతో పొలంలో పంట పైర్లు పలుచనైపోతున్నాయి. ఈ దశలో సస్యరక్షణ చర్యలు చేపట్టకపోతే పంటను పూర్తిగా కోల్పోవాల్సి ఉంటుందని వ్యవసాయాధికారులు హెచ్చరిస్తున్నారు. కత్తెర పురుగు మొదట్లో ఆకులను గోకి తింటుందనీ, ఆ తరువాత సుడిలోకి ప్రవేశించి కాండం తొలిచి తినేస్తుందనీ, దీంతో పైరు పూర్తిగా బలహీనపడి వాడిపోతుందని పేర్కొంటున్నారు.

### సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

మొక్కజొన్న పంటకు అధిక నష్టం కలిగిస్తున్న కత్తెర పురుగు నివారణకు 2, 3 ఆకుల దశలో వేప మందు 1500 పీపీఎంని పిచికారీ చేసుకోవాలి. తద్వారా గుడ్ల దశలో ఉన్న కత్తెర పురుగును నివారించవచ్చు. పొలంలో లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలి. ఎమామీథేన్ బెంజోనెట్ మందును పైర్ల సుడుల్లో పడేవిధంగా పిచికారీ చేసుకోవాలి. తద్వారా పురుగును అరికట్టవచ్చు.

-వంశీకృష్ణ, ఏఓ, చిలమత్తూరు


## విశాలాఫెర్రర్‌కు అవార్డు

7లో

## టీడీపీ కార్యకర్తలపై వైసీపీ వర్గీయుల దాడి


గాయపడిన టీడీపీ కార్యకర్తలు

బుక్కపట్నం, డిసెంబరు22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకోట గ్రామానికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలపై అదే ఊరికి చెందిన వైసీపీ వర్గీయులు ఆదివారం దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజకీయ కక్ష పెంచుకున్న వైసీపీ కార్యకర్తలు తుంగ గంగాద్రి, యల్లప్ప, ఉత్తప్ప, సాయి, కుండ్ల కేశవ రెండ్రోజుల క్రితం తమ అంతు చూస్తామంటూ టీడీపీ కార్యకర్తలు రాము, గణపతి, చంద్రమోహన్‌ను ఫోన్‌లో బెదిరించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడానికి బాధితులు ఆదివారం బుక్కపట్నం బయల్దేరారు. మార్గమధ్యలో బీడకుంటపల్లి వద్ద వైసీపీ వర్గీయులు దాడిచేసి, తీవ్రంగా గాయపరిచారు. దీనిపై పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఉపాధ్యాయుడి ఆత్మహత్య

**అప్పు తీసుకున్న వారు చెల్లించకపోవడంతోనే..!**

(వివరాలు 7లో....)

# భారీ స్కోరు దిశగా మహారాష్ట్ర


గంట కొట్టి మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఏజీఎం శివకుమార్

**తొలిరోజు నాలుగు వికెట్ల నష్టానికి 284**
**కిరణ్ చోలామాలే భారీ సెంచరీ..**
**ఆంధ్రాతో కూచ్‌బెహార్ ట్రోఫీ మ్యాచ్**

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): బీసీసీఐ కూచ్ బెహార్ అండర్-19 ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో మహారాష్ట్ర జట్టు భారీ స్కోరు దిశగా సాగుతోంది. స్థానిక ఆర్డీటీ స్టేడియంలో ఆదివారం ఆంధ్రా-మహారాష్ట్ర క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ప్రారంభమైంది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఏజీఎం శివకుమార్ బెల్ రింగ్ చేసి, బీసీసీఐ సెలెక్టర్ హర్వీందర్‌సింగ్ సోఢీ, టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. టాస్ గెలిచిన మహారాష్ట్ర మొదట బ్యాటింగ్ ఎంచుకుంది. 90 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 284 పరుగులు చేసింది. బ్యాటర్ కిరణ్ చోలామాలే 209 బంతుల్లో 19 బౌండరీలు, 6 సిక్సర్లతో 162 పరుగులు చేశారు. సుష్రుత్ సావంత్ 59, నీరజ్‌జోషి 25 పరుగులు చేశారు. ఆంధ్రా బౌలర్లు యువన్ 2 వికెట్లు పడగొట్టగా.. ఆదిత్యరెడ్డి, యశ్వంత్, రాజేష్ చెరో వికెట్ తీశారు. 31కి మొదటి వికెట్ కోల్పోగా, రెండో వికెట్ 80 పరుగుల వద్ద కోల్పోయింది. ఆ తరువాత 273 పరుగుల వరకు వికెట్ పడకుండా మహారాష్ట్ర బ్యాటర్లు కాపాడుకున్నారు. భారీ స్కోర్‌పై కన్నేసిన మహారాష్ట్ర జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి మహారాష్ట్ర 284-5గా నిలిచింది.



కిరణ్ చోలామాలే (162)

# విశాలా ఫెర్రర్‌కు అవార్డు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సౌతిండియా ఉమెన్ అచీవ్‌మెంట్ అవార్డుకు ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాలాఫెర్రర్ ఎంపికయ్యారు. సీఈఓ రాధా ఆధ్వర్యంలో ఆదివారం బెంగళూరులోని కేఈఏ ప్రభాత్ ఆడిటోరియంలో ఆమె అవార్డు అందుకున్నారు. మహిళల అభివృద్ధికి విశాలా ఫెర్రర్ ఆర్డీటీ ద్వారా చేస్తున్న కృషికి ఈ అవార్డు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.



అవార్డు అందుకున్న తరువాత మాట్లాడుతున్న విశాలా ఫెర్రర్



# దాహం తీరింది.. కానీ..!

## గుత్తిలో తగ్గిన తాగునీటి ఎద్దడి

గత సంవత్సరం నెల రోజులకోసారే సరఫరా
నేడు 8-10 రోజులకోసారి..
శాశ్వత పరిష్కారం ఎప్పుడో..?
రూ. 173 కోట్ల ప్రాజెక్టుకు మోక్షం లభించేనా..?

నియోజకవర్గంలో రెండో మున్సిపాలిటీ అయిన గుత్తి పట్టణంలో భయంకరంగా ఉన్న తాగునీటి సమస్య కొంత తీరింది. గత ఏడాది ఇదే సమయానికి నెల రోజులకోసారి తాగునీరు సరఫరా అయ్యేది. గుత్తిలో తాగునీటి సమస్య పరిష్కారానికి వైసీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయలేదని, తాను గెలిస్తే సమస్య పరిష్కారానికి కృషిచేస్తానంటూ గుమ్మనూరు జయరాం ఇచ్చిన ఎన్నికల హామీ అయన్ను గెలుపుతీరాలకు చేర్చింది. చెప్పిన విధంగానే ఎమ్మెల్యే అయ్యాక ఆయన గుత్తి సమస్యపై దృష్టిని సారించారు. నెలకోసారి తాగునీరు వచ్చే పరిస్థితి నుంచి ఎనిమిది, పది రోజులకోసారి నీరు వచ్చేలా మెరుగుపరిచారు. అయినా గుత్తిలో నీటి సమస్య పూర్తిగా దూరం కాలేదు.

- ఆంధ్రజ్యోతి, గుంతకల్లు/గుత్తి


గుత్తి చెరువులోకి చేరిన హంద్రీనీవా నీరు

### వైసీపీ హయాంలో కటకట

2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం గుత్తిలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టింది. రూ. 173 కోట్లతో భారీ తాగునీటి ప్రాజెక్టు నిర్మాణానికి రూపకల్పన చేసింది. పనులను కూడా మొదలు పెట్టింది. అంతలోనే ఎన్నికలు రావడంతో జగన్ ప్రభుత్వం గద్దెనెక్కింది. 2019 తర్వాత 2024 వరకూ గుత్తిలో తాగునీటి సమస్యను పక్కనపెట్టేశారు. ఫలితంగా గుత్తిలో గుక్కెడు నీటి కోసం ప్రజలు పడరాని పాట్లు పడ్డారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మిడ్‌పెన్నార్ ప్రాజెక్టు పనులు ప్రారంభించారు. గుత్తి పురపాలక సంఘంలో 25 వార్డుల్లో 60 వేల జనాభా ఉంది. 6,571 కొళాయి కనెక్షన్లు ఉన్నాయి. సత్యసాయి, వైటీసీ ప్రాజెక్టుల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ నీరు 25 వార్డుల ప్రజలకు సరిపోవడం లేదు.


నిలిచిపోయిన తాగునీటి ప్రాజెక్టు వద్ద సెల్ఫీ తీసుకుంటున్న చంద్రబాబు (ఫైల్)

### చంద్రబాబు హామీతో ఆశలు

గుత్తిలో తాగునీటి సమస్య పరిష్కారానికి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) నిధులు రూ. 173 కోట్లు మంజూరు చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయి ఉంటే ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేది. గత వైసీపీ ప్రభుత్వం అర్ధంతంగా వదిలివేయడంతో ఆ ప్రాజెక్టు మూలనపడింది. పట్టణ శివారులో ఏర్పాటు చేసిన మిడ్ పెన్నార్ ప్రాజెక్టులో 11 ఎంఎల్‌డీ సామర్థ్యం ఉన్న వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటు, బీసీ కాలనీ, సూరశింగనపల్లి, చెర్లోపల్లిలో ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మించారు. మిడ్‌పెన్నార్ రిజర్వాయర్ నుంచి గుత్తి వరకు పైప్‌లైన్ ఏర్పాటు చేయాల్సి ఉంది. సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రచారంలో భాగంగా గుత్తికి వచ్చిన చంద్రబాబునాయుడు రూ. 173 కోట్లతో తన హయాంలో చేపట్టిన తాగునీటి ప్రాజెక్టును పరిశీలించి సెల్ఫీ ఫొటో దిగారు. ఈ ప్రాజెక్టును వైసీపీ మూలన పడేసిన విషయాన్ని ప్రజలకు గుర్తుచేశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే జయరాం తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు.


గుత్తి ఆర్ఎస్‌లో ఇంటర్ కనెక్షన్ చేసిన బోరు

### కొంత ఉపశమనం

అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో గుత్తి తాగునీటి సమస్యపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించింది. పట్టణంలోని కోట వీధిలో మూడు బోర్లు, బసినేపల్లి వంక వద్ద ఒక బోరు, పామిడిలో పెన్నా నది వద్ద ఒక బోరు వేసి కొత్త మోటార్లను బిగించారు. ఈ సీజన్‌లో గుత్తి చెరువుకు హంద్రీనీవా నీటిని అందించారు. ఫలితంగా చెరువు సమీపంలో ఎండిపోయిన బోర్లు రీచార్జి కావడంతో వాటిని వినియోగంలోకి తెచ్చారు. ఇలా రీచార్జయిన 11 బోర్లను రూ. 20 లక్షలతో ఇంటర్ కనెక్టివిటీని ఏర్పరచి వార్డులకు నీటిని అందజేస్తున్నారు. ఎప్పటికప్పుడు పైపు లైన్లు, చెడిపోయిన మోటార్లకు మరమ్మతులు చేయిస్తూ నీటి సరఫరాపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టిని పెట్టారు. గతంలో నెలకు ఒకసారి కూడా ఏ నీరూ ఇవ్వలేని దుస్థితి నుంచి.. ఇప్పుడు 8-10 రోజులకు ఒకసారి మంచినీరు, మూడు రోజులకొకసారి ఉప్పునీటిని వదులుతున్నారు. వాటర్ ట్యాంకర్ల నిర్వాహకులతో చర్చించి పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చి, వార్డులకు తాగునీటిని సరఫరా చేయిస్తున్నారు.

### తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం



గుత్తిలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృత నిశ్చయంతో ఉన్నాం. సీఎం చంద్రబాబు నాయుడు కూడా గుత్తి తాగునీటి సమస్య పరిష్కారానికి స్పష్టమైన అభిప్రాయంతో ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తాగునీటి ప్రణాళికను ప్రకటించే లోపే రాయలసీమ జిల్లాల్లో నీటి ఎద్దడిపై చర్యలు చేపట్టాలని సీఎంను కోరాను. కొత్త బోర్లు వెయ్యడం, మోటర్లను ఏర్పాటు చేయడం ద్వారా ప్రస్తుతం తాగునీటి ఎద్దడిని గణనీయంగా తగ్గించాం. వీలయినంత త్వరగా పూర్తి స్థాయిలో సమస్యను పరిష్కరిస్తాం. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు తీసుకుంటాం.

- గుమ్మనూరు జయరాం, గుంతకల్లు ఎమ్మెల్యే

### యుద్ధప్రాతిపదికన చర్యలు



గుత్తి పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్యపై యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించడానికి చర్యలు తీసుకున్నాం. గతంలో నెలకోసారి నీరు ఇచ్చేవారు. ఇప్పుడు 8-10 రోజులకు ఒకసారి నీరిస్తున్నాం. 11 చోట్ల బోర్లకు ఇంటర్ కనెక్షన్ ఇచ్చి వార్డులకు అందిస్తున్నాం. వేసవిలో సమస్య తలెత్తకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్ కింద రూ. 2 కోట్ల నిధులను కోరుతూ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాం.

-జబ్బర్ మియా, మున్సిపల్ కమిషనర్, గుత్తి

### సమస్య లేకుండా చేశారు



మా వార్డులో గతంలో నీరే వచ్చేది కాదు. తాగునీటి కోసం అవస్థలు పడ్డాం. ఇప్పుడు పది రోజులలోపు సత్యసాయి నీటిని ఇస్తున్నారు. సమస్య లేకుండా చేశారు. పది రోజులకు కాకుండా అంతరాన్ని మూడు రోజులకు తగ్గించాలి. ఎండాకాలం కూడా నీటి సమస్య తలెత్తకుండా చూడాలి.

-లక్ష్మీదేవి, 25వ వార్డు, గుత్తి

### ఇప్పుడు ఎంతో మేలు

మా కాలనీలో తాగునీటికి తీవ్ర సమస్యగా ఉండేది. ఇప్పుడు నీరు వస్తోంది. గతంలో నెలకోసారి కూడా నీరు వచ్చేది కాదు. నీటి ట్యాంకర్ల కోసం వేచి చూసేవాళ్లం. ఇప్పుడు పది రోజులకు సత్యసాయి నీరు అందిస్తున్నారు. మూడు రోజులకు ఒకసారి బోర్లు నీళ్లు ఇస్తున్నారు. రోజు మార్చి రోజు నీరిస్తే బాగుంటుంది.



-లలిత, 6వ వార్డు, గుత్తి

# జాబ్ మేళాకు అనూహ్య స్పందన

**కష్టపడి పనిచేస్తే మంచి అవకాశాలు.. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ**


జాబ్ మేళాలో మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం అర్బన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): అంబికా ఫౌండేషన్, అమర రాజా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు నిరుద్యోగుల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఆదివారం అనంతపురం నగర శివారులోని కక్కలపల్లి క్రాస్ వద్ద ఎంపీ కార్యాలయంలో అప్రెంటిషప్ ట్రైనీ, మిషన్ ఆపరేటర్స్ ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు 145 మంది హాజరయ్యారు. ఇందులో 98 మంది ఉద్యోగాల కోసం ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. కష్టపడి పనిచేస్తే భవిష్యత్‌లో మరిన్ని మంచి అవకాశాలు వస్తాయన్నారు. జాబ్ మేళా నిర్వహించి తమకు ఉద్యోగ అవకాశం కల్పించినందుకు ఎంపీకి నిరుద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అమర రాజా కంపెనీ ప్రతినిధి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుడి ఆత్మహత్య


**అప్పు తీసుకున్న వారు చెల్లించకపోవడంతోనే..!**

కూడేరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మూరు గ్రామ సమీపంలోని అగ్రిగోల్డ్ వెంచర్‌లో భాస్కర్‌బాబు (53) అనే ఉపాధ్యాయుడు ఆదివారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు డి.హీరేహాళ్ మండలం మలికేతి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల్లో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న భాస్కర్ బాబు అనంతపురంలో నివాసముంటున్నాడు. బుక్కరాయసముద్రం మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన నరేష్‌కుమార్‌రెడ్డి, అనంతపురం పట్టణం హౌసింగ్ బోర్డులో నివాసముంటున్న శ్రీనివాసులుకు ఈయన రూ.60 లక్షల వరకు డబ్బులు అప్పు ఇచ్చాడు. వారు తిరిగి చెల్లించకపోవడంతో బ్యాంకుల్లో ఈఎంఐలు ఎలా కట్టాలని మథన పడ్డాడు. ఈక్రమంలోనే తీవ్ర ఒత్తిడిలో కూరుకుపోయాడు. ఒత్తిడిని భరించలేక ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. దీంతో ఉదయం ఇంటి నుంచి ద్విచక్ర వాహనంలో కమ్మూరు గ్రామ సమీపంలోని అగ్రిగోల్డ్ వెంచర్‌లోకి వెళ్లాడు. ఆత్మహత్య చేసుకునే ముందు నరేష్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసుల నుంచి రూ.60 లక్షలు ఇప్పించాలని పోలీసులను వేడుకుంటూ సూసైడ్ లెటర్ రాశాడు. తర్వాత పురుగుల మందు తాగి పడిపోయాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఉపాధ్యాయుడిని స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు అక్కడికి వచ్చి 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య కూడేరు మండలం హంసాపల్లి గ్రామంలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులున్నారు.

# నేడు పంచాయతీరాజ్ చాంబర్ సమావేశం

అనంతపురం అర్బన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఏపీ పంచాయతీరాజ్ చాంబర్, సర్పంచుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం అనంతపురంలోని జడ్పీ సమావేశపు హాలులో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు చాంబర్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డేగల కృష్ణమూర్తి, రాష్ట్ర కార్యదర్శి ఇస్మాయిల్ ఆజాద్, ఉమ్మడి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు గెనుగుంట్ల భూషణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు జరిగే సమావేశానికి పంచాయతీరాజ్ చాంబర్ జాతీయ అధ్యక్షుడు బాబు రాజేంద్రప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పనిచేసి సార్వత్రిక ఎన్నికల్లో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌ను సన్మానిస్తామన్నారు. సమావేశానికి ఉమ్మడి జిల్లా నుంచి సంఘం నాయకులు, సర్పంచులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

# టమోటా కిలో రూ. 23



అనంతపురం రూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 23తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు ఆదివారం 900 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 16, కనిష్ఠ ధర రూ. 10 పలికినట్లు ఆయన తెలిపారు.

# 631 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఆదివారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 631 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2 కు ఔట్‌ఫ్లో కింద 162 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

# అట్టహాసంగా ధన్వంతరీ ఆసుపత్రి ప్రారంభం

- మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు, టీడీపీ నేతల హాజరు


ఆసుపత్రిలో వసతులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు, నాయకులు

అనంతపురం టౌన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు నెట్టెం వెంకటేష్ తనయుడు జనరల్ అండ్ ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ నెట్టెం శివకుమార్‌కు చెందిన ధన్వంతరీ ఆసుపత్రిని అట్టహాసంగా ప్రారంభించారు. ఆదివారం రామ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఈ నూతన హాస్పిటల్ ప్రారంభోత్సవాన్ని సంప్రదాయబద్దంగా పూజలతో నిర్వహించారు. ప్రారంభోత్సవానికి బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితమ్మ, హిందూపురం పార్లమెంట్ సభ్యుడు బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, బండారు శ్రావణిశ్రీ, ఎంఎస్ రాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, టీడీపీ నాయకులు బాంబే డైయింగ్ నాగన్న, పూలకుంట నాగార్జున, గడ్డం సుబ్రహ్మణ్యం, సరిపూటి రమణ, రాయల్ మురళి, అపెక్స్ కన్‌స్ట్రక్షన్ అధినేత బోయ తిరుపాలు, నాయకులు, బంధువులు పెద్దఎత్తున తరలివచ్చారు. అతిథులు అక్కడ ఏర్పాటు చేసిన వసతులు, వైద్య పరికరాలను పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. డాక్టర్ శివకుమార్‌కు శుభాకాంక్షలు తెలిపి, మంచిగా వైద్యసేవలందించి మరింత మంచిపేరు తెచ్చుకోవాలని అతిథులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నేత నెట్టెం వెంకటేష్, ఆయన సతీమణి నెట్టెం లక్ష్మీదేవి, డాక్టర్ నెట్టెం శివకుమార్, ఆయన సతీమణి మానస, నెట్టెం శ్రీనివాస్, నెట్టెం సంగీతతోపాటు బంధుమిత్రులు పాల్గొన్నారు.

# కోర్సు కొనసాగించాలి

అనంతపురం విద్య, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని కేఎస్ఆర్ జూనియర్ కళాశాలలో ఆప్తాల్మిక్ కోర్సు కొనసాగించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు, కళాశాల విద్యార్థినులు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థినులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పరమేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అత్యధిక విద్యార్థులు కేఎస్ఆర్ కళాశాలలో చదువుతున్నారని తెలిపారు. ఇంటర్ బోర్డు మరిన్ని కోర్సులు ప్రారంభించాల్సింది పోయి.. ఉన్న కోర్సులను నిలిపివేసి కళాశాలలను నిర్వీర్యం చేస్తోందన్నారు. ఆప్తాల్మిక్ టెక్నీషియన్ కోర్సును రద్దు చేయడం కోసం పలుమార్లు బోర్డు నుంచి కళాశాల స్టాఫ్‌కు మౌఖిక ఆదేశాలిస్తూ...హెచ్చరికలు జారీ చేయడం సరికాదన్నారు. ఈ కోర్సులో ఇంటర్ మొదటి, రెండో సంవత్సరంలో 45 మంది చొప్పున విద్యార్థులు చదువుతున్నారన్నారు. చాలా మంది విద్యార్థులు గతంలో ఈ కోర్సు పూర్తి చేసి ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు సోము, విజయ్, సాయి, ధనుష్, రాకేష్, కార్తీక్, హేమలత, దివ్యకళ, దీపిక, మమత తదితరులు పాల్గొన్నారు.

# సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమ, మంగళవారాల్లో అనంతపురంలో నిర్వహించనున్న జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ పిలుపునిచ్చారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సోమవారం ఉదయం 10.30 గంటలకు ఆర్ట్స్ కళాశాల నుంచి ప్రదర్శన నిర్వహిస్తామని తెలిపారు. 11.30 గంటలకు లలితకళా పరిషత్‌లో నిర్వహించే బహిరంగ సభలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు వెంకటేశ్వరరావు, ప్రభాకర్‌రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. 2021లో తాడిపత్రిలో సీపీఎం జిల్లా మహాసభలు నిర్వహించామని, అక్కడ తీసుకున్న నిర్ణయాల అమలును సమీక్షించుకుంటామని తెలిపారు. రానున్న మూడు సంవత్సరాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమ ప్రణాళికను ఈ మహాసభల్లో రూపొందిస్తామన్నారు. గతంలో జరిగిన దేశ, రాష్ట్రవ్యాప్త పిలుపులు, జిల్లాలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాల, రైతు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు, నిరుద్యోగ యువత, విద్యార్థి, సామాజిక సమస్యలపై, మహిళా సమస్యల పరిష్కారంకోసం ఎన్నో కార్యక్రమాలను సీపీఎం చేపట్టిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బాలరంగయ్య, రామిరెడ్డి, రామాంజనేయులు, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

# వదాన్య టాలెంట్ టెస్టుకు విశేష స్పందన


టాలెంట్ టెస్టును పరిశీలిస్తున్న డీఎస్పీ విజయ్‌కుమార్


వదాన్య టీంతో డీఎస్పీ

కొత్తచెరువు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): వదాన్య టాలెంట్ టెస్టుకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ప్రతి ఏడాది వదాన్య సొసైటీ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం కొత్తచెరువులోని ఏడు పరీక్షా కేంద్రాల్లో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి విద్యార్థులు పెద్దఎత్తున రావడంతో పరీక్షా కేంద్రాలు కిక్కిరిసిపోయాయి. పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, కొత్తచెరువు సీఐ ఇందిరా పర్యవేక్షించారు. జిల్లా వ్యాప్తంగా 9,10 తరగతుల విద్యార్థులు 3,400 మంది హాల్ టికెట్లు పొందగా 3,150 మంది హాజరయ్యారు. దీన్నిబట్టే ఈ టాలెంట్ టెస్టుకు ఎంత స్పందన ఉందో అర్థమవుతుందని డీఎస్పీ కొనియాడారు. విద్యార్థులు తమ మేధాశక్తిని పరీక్షించుకోవడానికి ఇలాంటి టాలెంట్ టెస్టులు ఉపయోగపడతాయన్నారు. జిల్లాలోని 150 ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులు తరలిరావడం అభినందనీయమన్నారు. ప్రతి ఏడాది పరీక్షలు నిర్వహిస్తున్న ఫౌండర్ అశోక్ పడపాటి, అతడి స్నేహితులను అభినందించారు. కార్యక్రమంలో వదాన్య సొసైటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ పరీక్షా ఫలితాలను జనవరి 10న విడుదల చేస్తామని సంస్థ నిర్వాహకులు అశోక్ తెలిపారు.

# రాష్ట్ర డైరెక్టర్ ఆదేశాలతోనే పోస్టు భర్తీ

- ఇన్‌చార్జ్ సీడీపీవో రాధమ్మ

**ఆంధ్రజ్యోతికి స్పందన**

కళ్యాణదుర్గం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కంబదూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో పోస్టును రాష్ట్ర డైరెక్టర్ ఆదేశాల మేరకే భర్తీ చేస్తారని ఇన్‌చార్జ్ సీడీపీవో రాధమ్మ తెలిపారు. ఆదివారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'హాట్ సీట్' శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. కంబదూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలను జిల్లా అధికారుల ఉత్తర్వుల మేరకే ఉద్యోగోన్నతులు, పోస్టుల భర్తీ చేశామని పేర్కొన్నారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా అర్హతల మేరకే పోస్టులను భర్తీ చేశామని వివరించారు. సూపర్‌వైజర్లు అందరూ విధులకు సక్రమంగా హాజరవుతున్నారని అన్నారు. ఎఫ్ఆర్ఎస్ ద్వారా సిబ్బంది తగిన సమయానికి విధులకు సక్రమంగా హాజరవుతున్నారని పేర్కొన్నారు.

## న్యూస్ బాక్స్...

### 5 నుంచి యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు

ధర్మవరం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కాకినాడలో జనవరి 5,6,7,8 తేదీల్లో యూటీఎఫ్ రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభలను నిర్వహిస్తున్నామని, వాటిని విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి పిలుపు నిచ్చారు. ఆదివారం స్థానిక యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాల యంలో మహాసభల ఆహ్వానపత్రికలను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ధర్మవరం జోన్ నాయకులు రామకృష్ణనాయక్, లక్ష్మయ్య, ఆంజనేయులు,సకలచంద్రశేఖర్, పెద్దకోట్ల సురేశ్, బిల్లే రామాంజినేయులు, రాంప్రసాద్, ప్రదీప్‌కుమార్, సాయిగణేశ్ పాల్గొన్నారు.

### అక్రమ లేఅవుట్లు తొలగించాల్సిందే

గాండ్లపెంట, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అసైన్డు భూములను రైతులకు పంపిణీ చేసింది. భూముల ధరకు రెక్కలు రావడంతో రియల్టర్ల కన్ను వాటపై పడింది. మండలంలోని కురమామిడి పంచాయతీ రెక్కమాను గ్రామంలో తెప్పలు కుప్పలుగా.. అడ్డుగోలుగా ఆ భూములు కొనుగోలు చేస్తున్నారు. ఇందులో పట్టాభూములతో పాటు అసైన్డు భూములనూ కొనుగోలు చేస్తున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతి ఈ నెల 17న ఓ కథనాన్ని ప్రచురించింది. దీనిపై పంచాయతీ కార్యదర్శి భవాని స్పందించారు. రెక్కమానులో వేసిన అక్రమ లేఅవుట్లును తొలగించాలని ఆదేశించినట్లు ఆదివారం ఆమె తెలిపారు. పంచాయతీ, రెవెన్యూ అధికారులు వెళ్లి యజమాలకు అక్రమ లేఅవుట్లు తొలగించాలని ఆదేశించినట్లు చెప్పారు.

### వడ్డెర సంఘం ఏర్పాటు

నంబులపూలకుంట, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక శివాలయం సమీపంలోని కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన వడ్డెర్ల సమావేశంలో మండల సంఘాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా బత్తల అక్కులప్ప, గౌరవాధ్యక్షుడిగా ఆంజనేయులు, ఉపాధ్యక్షుడిగా డెరంగుల వెంకటరమణ, గౌరవ సలహాదారుడిగా డెరంగుల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మయ్య, సభ్యులుగా తలుపుల గంగరాజు, కుచ్చెపు గంగరాజు, వడ్డె బాబు, వల్లెపు శివ, కుచ్చెపు శ్రీనివాసులు, లక్ష్మయ్య, శంకర్ ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ అధ్యక్షులు ఉత్తప్ప, గంగరాజు పాల్గొన్నారు.

### పోస్టుమన్ మృతి


శ్రీరాములు (ఫైల్)

తనకల్లు: మండలంలోని కొండ వెనకపల్లిలో పోస్టుమన్ శ్రీరాములు (52) ఆదివారం ఉదయం గుండెపోటుతో మరణించారు. ఇటీవల ఆరోగ్యం సరిగా లేకపో వడంతో అనంత పురంలోని ఓప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం గుండెనొప్పి రావడంతో ఆసుపత్రిలోనే మరణించాడు. ఆయన మృతదేహానికి తోటి ఉద్యోగులు, గ్రామస్థులు నివాళు లర్పించారు. శ్రీరాములుకు భార్య వరలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

### కాలువ పూడ్చివేత



తాడిమర్రి: పీఏబీఆర్ కుడికాలువ ద్వారా తాడిమర్రి మండలానికి వస్తున్న నీటిని అక్రమంగా తరలించుకోవడా నికి తీసిన కాలువను అధికారులు ఆదివారం పూడ్చివేశారు. నీటిని తరలించుకోవద్దని జేఈలు చిన్నపరెడ్డి, బసవరాజు స్పష్టం చేశారు. నిడిగల్లు చెరువుకు నీరుతీసుకెళ్లేందుకు రైతులు కాలువను తవ్వకోగా తాము పూడ్చివేయించామన్నారు. ఎవరూ అక్రమంగా నీటిని తరలించుకోరాదని.. అనుమతి ఉన్న ప్రతి చెరువుకూ నీటిని అందిస్తామని అన్నారు.

### క్రిస్మస్ వేడుకలు ప్రారంభం

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ ప్రారంభ వేడుకలను ఆదివారం మండల వ్యాప్తంగా క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని వెంగళమ్మచెరువు, పెడపల్లి, కొట్లపల్లి, నిడిమామిడి, ఎనుమలపల్లి, కర్ణాటకనాగేపల్లి చర్చిల్లో కొవ్వొత్తులను వెలగించి కేక్‌కట్ చేసి ఈ వేడుకలను ప్రారంభించారు. కర్ణాటకనాగేపల్లిలోని కింగ్స్ చర్చిలో పాస్టర్ అరుణ్‌కుమార్ ప్రత్యేకప్రార్థనలు నిర్వహించారు.

### ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్‌కు మాతృవియోగం


నారాయణమ్మ(ఫైల్)

తాడిమర్రి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ వెంకటరమణ తల్లి నారాయణమ్మ (92) ఆదివారం మరణించారు. మోదులకుంటకు చెందిన నారాయణమ్మ.. కుమారుడు వెంకటరమణ వద్ద ఉండేది. ఆరోగ్యం సరిగా లేకపోవడంతో అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు. మోదులకుంట గ్రామంలో ఆమెకు అంత్యక్రియలు నిర్వహించారు.

### ఉపాధి హామీ సామాజిక తనిఖీ

బుక్కపట్నం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం ఉపాధి హామీ పథకంపై సామాజిక తనిఖీ చేసిన వివరాలను వెల్లడించారు. డ్వామా పీడీ విజయేంద్రనాథ్, ఏపీడీ జ్యోతి, ఎంపీడీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ మండలంలోని 13 పంచాయతీలకుగాను 2023-24లో 1,711 పనులకుగాను రూ.9,70,81,469 ఖర్చు చేశారని, ఈతనిఖీలో రూ.82,438 రికవరీ చేశామంనని తెలిపారు. దీనిపై గ్రామస్థులు భారీగా విమర్శలు చేస్తున్నారు. మండల ఉపాధి హామీ పనుల్లో రూ.9.70 కోట్లు ఖర్చు చేస్తే కేవలం రూ.82,438 రికవరి చేయడంపై అనుమానులు వ్యక్తం చేస్తున్నారు. మరాల పంచాయతీలో అసలు ఏ మాత్రం రికవరీ చూపకపోవడంపై విమర్శిస్తున్నారు. గత వైసీపీ పాలనలో ఎన్నికల ముందు విచ్చల విడిగా ఉపాధి పనుల్లో వైసీపీ సానుభూతి పరులకు దోచిపెట్టార ని, అయినా ఇప్పటికి అధికారులు వారి అక్రమాలు బయటపడకుండా కప్పిపుచ్చుతున్నారని మండిపడుతున్నారు. క్షేతస్థాయిలో ఈపనులపై విచారణ చేస్తే రూ.కోట్లలో అవినీతి బాగోతాలు బయటకు వస్తాయని అంటున్నారు.

### శంఖారావంపై ర్యాలీ

ఓబుళదేవరచెరువు : విజయవాడలో జనవరి 5న జరిగే హైందవం శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు పట్టణంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరశెట్టి, చంద్రశేఖర్, రంగారెడ్డి, ఆర్ఎంపీ హరి, నరేష్‌బాబు, నీలకంఠారెడ్డి, ఆంజనేయులు, గందోడి రాము, ఆర్ఎంపీ తిప్పన్న పాల్గొన్నారు.

### చీనీచెట్ల నరికివేత

బత్తలపల్లి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని తంబాపురం గ్రామంలో జనసేన పార్టీకి చెందిన రమణారెడ్డికి చెందిన తోటలోని 50 చీనీచెట్లను గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి నరికేశారు. ఆదివారం సాయంత్రం రమణారెడ్డి తోటకు వెళ్లిడంతో ఈ విషయం వెలుగుచూసింది. ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయడంతో టీడీపీ కార్యకర్త గిరిజన శివయ్యను వారు అనుమానంతో అదుపులోకి తీసుకొని... పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ఆ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి.. సీఐ ప్రభాకర్‌తో చర్చించారు. ఆధారాలు లేకుండా కేవలం అనుమానం ఇలా శివయ్యను స్టేషన్‌కు తరలించడం అన్యాయమన్నారు.

# చెరువు నిండా నీరు

# పైరుకు అందని తీరు



## మరమ్మతులకు నోచుకోని తూములు

## సాగునీటికోసం రైతుల ఎదురుచూపు

## పట్టించుకోని అధికారులు

కొత్తచెరువు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): బుక్కపట్నం చెరువు నిండా నీరున్నా.. కట్టకింద వరి రైతులు సాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఇందుకు గత పాలకులు, అధికారుల నిర్లక్ష్యమే కారణం. నాలుగు సంవత్సరాల తరువాత హంద్రీనీవా కాలువ ద్వారా చెరువు నిండుతోంది. అయితే సంగమేశ్వర దేవాలయం వద్ద చెరువుకు ఉన్న తూము చెడిపోవడంతో.. నీరు విడుదల కావడం లేదు. ఈ తూము పరిధిలోని చిన్నకాలువ, పెద్దకాలువల కింద దాదాపు రెండు వేల ఎకరాలు వరి సాగవుతోంది. ఇప్పటికే వెయ్యి ఎకరాల దాకా వరినాట్లు వేయడానికి భూములను దుక్కులు దున్నుకొని సిద్ధం చేసుకున్నారు. వందలాది మంది రైతులు వరి పంట సాగుచేయడానికి సిద్ధమయ్యారు. వరిపైరు నాటడానికి సమయం అయ్యింది. తూములు పనిచేయకపోవడంతో తమ పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తూముల మరమ్మతులు చేయాలని గతంలోనే పాలకులు, అధికారులకు పలుమార్లు తెలిపినా పట్టించుకోలేదని మండిపడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం చెరువులు, తూముల మరమ్మతులను గాలికి వదిలేసిందని, కనీసం సాగునీటి కాలువల్లో పూడికతీత పనులు కూడా చేపట్టలేదని వాపోతున్నారు. సాగునీటి సంఘం ఎన్నికలను సైతం నిర్వహించలేదని, ప్రభుత్వ అధికారులు సైతం చెరువులు, తూముల గురించి పట్టించుకున్న పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయకట్టు కింద ఉన్న రైతులే చందాలు వేసుకొని.. కాలువల్లో పూడికను తొలగించుకుంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వమైనా ఈ సమస్యలు పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.


మరమ్మతుకు గురైన తూము, నీరుపారక ఎండిన కాలువ (ఇన్‌సెట్లో)


నీరు పారక బీడుగా ఉన్న దుక్కులు

### తూమును శుభ్రం చేయిస్తున్నాం

గత ప్రభుత్వం చెరువులు, తూముల మరమ్మతులు గురించి పట్టించుకోలేదు. వర్షలు కురిసినప్పుడు చెరువులోని నీరు తూముల నుంచి వృథాగా పోకుండా ఇరిగేషన్ అధికారులు వరిగడ్డి, మట్టితో పూడ్చివేశారు. ఆకతాయిలు పెద్దపెద్ద రాళ్ల వేయడంతో తూములు తెరవడానికి కష్టంగా ఉంది. అధికారుల సూచన మేరకు బోరు గ్యాస్ ఉపయోగించి తూమును క్లీన్ చేయించడానికి చర్యలు తీసుకుంటున్నాం.

**-నవీన్‌కుమార్, సాగునీటి సంఘం అధ్యక్షుడు, కొత్తచెరువు**

### తూములకు మరమ్మతులు చేయించాలి



చెరువుకువున్న తూముల గేట్లు విరిగిపోయాయి. తూములను మట్టితో ఇరిగేషన్ అధికారులు పూడ్చివేశారు. దీంతో ప్రతిసారి పంటసాగుకు తూములను తెరవాలంటే కష్టంగా ఉంది. తూములకు మరమ్మతులు చేయాలని పలువూర్లు అధికారులకు చెప్పినా వారు స్పందించలేదు. ఇప్పటికైనా మరమ్మతులు చేయించాలి.

**- ఎం.రాజశేఖర్, రైతు, కొత్తచెరువు**

### వరినారు ఎండిపోతోంది



బుక్కపట్నం చెరువు నిండడంతో 20 ఎకరాల్లో వరి నాట్లు వేయడానికి 30 వేల విత్తనాల వడ్లు కొనుగోలు చేసి వరిపైరు పోశాను. తూములు తెరుచుకోకపోవడంతో పైర్లు ఎండిపోతున్నాయి. తూములను తెరిపించి సాగునీరు అందించకపోతే వరిసాగు వదులుకోవాల్సిన పరిస్థితి ఉంది.

**- పోలన్నగారి సుబ్రహ్మణ్యం, రైతు, కొత్తచెరువు**

### తూములు తెరవడానికి ప్రయత్నిస్తున్నాం



సంఘమేశ్వర దేవాలయం వద్ద ఉన్న చెరువు తూము గేట్లు విరిగిపోయాయి. చెరువులోని నీరు వృథా కాకుండా గతంలో మట్టి, రాళ్లతో అధికారులు పూడ్చివేయించారు. ప్రస్తుతం చెరువు నిండడంతో రైతులు వరిసాగుకు వరినారు పోసుకున్నారు. అయితే తూమును తెరవడానికి 10 రోజుల నుంచి ప్రయత్నిస్తున్నాం. మట్టి, రాళ్ల అడ్డు ఉండటంతో తెరుచుకోలేదు.

**- బోయ నరసింహులు, పెద్ద నీరుగుట్టి, కొత్తచెరువు**

# అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్లతో నిఘా

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్లతో నిఘా వేశామని, చట్టాలకు అతిక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని పుట్టపర్తి రూరల్ ఎస్ఐ లింగన్న హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం పుట్టపర్తి రూరల్ అటవీ ప్రాంతాలైన అమగొండపాల్యెం, వెంగళమ్మచెరువు, పెడపల్లి, బత్తలపల్లి పరిసర నిర్మానుష్యమైన ప్రాంతాలతో పాటు రూరల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షించామన్నారు. ఆయా ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం సేవించడం, గంజాయి వినియోగం, పేకాట, ఈవ్ టీజింగ్, చైన్ స్నాచింగ్ తదితర అసాంఘిక కార్యకలాపాల కట్టడికి ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. డ్రోన్ నిఘా ప్రక్రియలో ఆర్ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టపర్తి సమీపాన అటవీప్రాంతంలో డ్రోన్ కెమెరా నిఘా →



### రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

బుక్కపట్నం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): విజయవాడలో సోమవారం నుంచే రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు స్థానిక జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పదో తరగతి చదువుతున్న గణేష్‌రెడ్డి మంజునాథ్, తొమ్మిదో తరగతి విద్యార్థి మోహన్‌కుమార్ ప్రతిభ కనబరచి రాష్టస్థాయికి ఎంపికయ్యారు. వీరిని ప్రధానోపాధ్యాయుడు జగదీష్, పీడీ నాగరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

### యూసీమాస్‌లో కదిరి విద్యార్థుల ప్రతిభ

కదిరి అర్బన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఈనెల 14న నిర్వహించిన యూనివర్సిల్ కాన్‌సెప్ట్యూట్ ఆఫ్ మెటల్ అర్థోమెటిక్ సిస్టమ్ (యూసీమాస్) పోటీల్లో కదిరి విద్యార్థులు ప్రతిభ చాటినట్లు నిర్వాహకురాలు సాఫియాభాను తెలిపారు. కదిరి నుంచి 14 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనగా.. రెండో స్థానంలో ఇద్దరు, మూడో స్థానంలో 12మంది ప్రతిభ చూపినట్లు చెప్పారు. ఆ విద్యార్థులకు ఆదివారం ప్రసాంసపత్రాలు అందించినట్లు చెప్పారు.



యూసీమాస్‌లో ప్రతిభచాటిన విద్యార్థులు

### రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం

ధర్మవరం: స్థానిక కళాజ్యోతి సర్కిల్లో ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద రాహుల్ గాంధీ దిష్టి బొమ్మను బీజేపీ నాయకులు ఆదివారం దహనం చేశారు. ఇందులో మంత్రి సత్య కుమార్‌యాదవ్ కార్యాలయ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు, బీజేపీ నాయకులు సాకే ఓబుళేశు, జింకాచంద్ర, గుండా పుల్లయ్య, శ్యామరావు, నబీరసూల్ పాల్గొన్నారు.


దిష్టిబొమ్మను దనహం చేస్తున్న బీజేపీ నాయకులు

### సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

ధర్మవరం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): వివిధ అనారోగ్య కారణాలతో ఆరోగ్యశ్రీ వర్తించక ప్రైవేటు ఆస్పత్రి చికిత్సలు పొందిన నియోజకవర్గంలోని ఆరుగురికి సీఎంఆర్ఎఫ్ (ముఖ్యమంత్రి సహాయ నిధి) నుంచి సాయం అందింది. ఆ చెక్కులను నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అనంతపురంలో వారికి ఆదివారం అందజేశారు. మొత్తం ఆరుగురికి రూ.13లక్షల చెక్కులను అందజేశారు. ఇందులో పట్టణంలోని కోటకు చెందిన అరుణాదేవికి రూ.9.08 లక్షలు మంజూరైంది.

**వృద్ధురాలికి నివాళి**

తాడిమర్రి: మండలంలోని పిన్నదరి గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ విశ్వనాథ్ తల్లి చెన్నమ్మ(70) అనారోగ్యంతో మరణించింది. ఆమె మృతదేహానికి పరిటాలశ్రీరామ్ ఆదివారం నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోనుగుంట్ల విజయ్‌కుమార్, మండల కన్వీనర్ కూచిరాము, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్, మండల మాజీ కన్వీనర్‌లు ధనుంజయనాయుడు, సాయి, అశ్వర్థ ఉన్నారు.


చెక్కులు అందజేస్తున్న పరిటాల శ్రీరామ్

### జనసేనలోకి వైసీపీ నాయకుల చేరిక

ధర్మవరం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ధర్మవరం మండలం గొట్లూరు గ్రామం నుంచి 220 కుటుంబాలు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మదుసూధన్‌రెడ్డి సమక్షంలో ఆదివారం పార్టీలోకి చేరారు. స్థానిక దుర్గానగర్‌కు చెందిన తలారిప్రతాప్ ఆధ్వర్యంలో బాలనరసింహులు, శేఖర్, సుకుర్, వెంకటరమణ, ఒంటికొండ నారాయణ, సుధాకర, శబరి, రాఘవ, పెద్ద నరసింహులు, ముంతాజ్‌తోపాటు200 కుటుంబాలకు చెందిన వైసీపీ నాయకులు జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అదేవిధంగా జనసేన మండల ఉపాధ్యక్షుడు జీవీ ఆధ్వర్యంలో ధర్మవరంలోని జనసేన పార్టీ కార్యాలయంలో గొట్లూరు గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకులు సాకే ఆంజనేయులు, బండినగేశ్, బండి నాగార్జున, పూజారి హరి, బండారు నాగార్జున, బండారు సోము, సురువు రవీంద్ర తదితర వైసీపీకి చెందిన 20 కుటుంబాల సభ్యులు జనసేన పార్టీలో చేరారు.

### రాష్ట్రీయ బాల పురస్కార్ ఇవ్వండి

ధర్మవరం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రోలర్ స్కేటింగ్‌లో అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన స్థానిక మంగళగిరి గ్రామానికి చెందిన బాలిక జెస్సీ రాజ్‌ను రాష్ట్రీయ బాల పురష్కార్‌కు పరిశీలించాలని ప్రధాన మంత్రి కార్యాలయానికి ఓ లేక పంపినట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. జెస్సీ రాజ్ 14 ఏళ్ల వయస్సులోనే దేశంమీద గర్వపడేలా తమ ప్రతిభను ప్రదర్శించిందని, ఆమె అభ్యాసం, పట్టుదల, కృషి అభినందనీయమని అన్నారు.

## క్రైం న్యూస్..

### చికిత్స పొందుతూ బాలిక మృతి

తనకల్లు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మలవాండ్లపల్లికి చెందిన మేఘన (15) కర్నూల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మరణించింది. అనారోగ్యంతో బాధ పడుతున్న ఆమె ఈ నెల 16న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం మెరు గైన వైద్యం కోసం అనంతపురానికి.. అక్కడ నుంచి కర్నూల్‌కు తరలిం చారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించింది. తండ్రి గోవిందప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపి తెలిపారు.

### భార్యపై హత్యాయత్నం

కదిరి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నివాసముంటున్న నగేష్ తనను హత్య చేయడానికి యత్నించినట్లు అతని భార్య మంజుల ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ నారాయణరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. అడపాలవీధిలో నివాసముంటున్న మంజుల, ముదిగుబ్బ మండలం యనుములవారిపల్లికి చెందిన నగేష్ ఐదున్నర సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. మనస్పర్థల రావడంతో వారు రెండు సంవత్సరాల నుంచి వేరు వేరుగా ఉంటున్నారు. కోర్టు విషయమై మంజుల ఇటీవల నగేష్‌కు ఫోన్ చేసింది. శనివారం రాత్రి కందికుంట నారాయణమ్మ కాలనీ బ్రిడ్జి వద్దకు రావాలని, అక్కడ మాట్లాడుకుందామని నగేష్ కోరాడు. దీంతో ఆమె శనివారం రాత్రి అక్కడి వెళ్లింది. నగేష్ ఆమెను అక్క డున్న ముళ్ల పొదల్లోకి బలవంతంగా లాక్కెళ్లి.. చార్జింగ్ వైర్‌తో గొం తుకు బిగించి హత్య చేయడానికి ప్రయత్నించాడు. ఆమె స్పృహ తప్పి పడిపోవడంతో అక్కడ నుంచి నగేష్ పరిపోయాడు. కొద్ది సమయానికి స్పృహ వచ్చిన ఆమె ప్రభుత్వ ఆసుపత్రి వెళ్లి.. చికిత్స పొందింది. ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.

### అమ్మమ్మ వద్దకు చేరిన బాలుడు

కదిరి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బాలుర హాస్టల్ నుంచి అదృశ్యమైన బాలుడు హైదరాబాద్‌లో ఉన్న అమ్మమ్మ వద్దకు చేరినట్లు కదిరి సీఐ నారాయణరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం హాస్టల్ విద్యార్థి జగదీష్‌నాయక్ అదృశ్యమయ్యాడని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు బాలుడి ఆచూకీ కోసం తీవ్రంగా ప్రయత్నించగా హైదరాబాద్‌లోని అమ్మమ్మ ఇంటికి చేరుకున్నట్లు సమాచారం అందిందన్నారు. కాగా, మరో బాలుడు ఆదివారం తప్పిపోయాడని తండ్రి ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన సీఐ తన సిబ్బందితో రైల్వేస్టేషన్, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో వెతికారు. బాలుడి ఆచూకీ కోసం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. అది చూసిన కొంతమంది పిల్లవాడి సమాచారం పోలీసులకు అందించారు. స్టేషన్‌కు తీసుకువచ్చి తండ్రికి అప్పగించారు. ఇది గంటలోపే జరిగిందని సీఐ తెలిపారు.

### కర్ణాటక మద్యం స్వాధీనం

ఓబుళదేవరచెరువు/అమడగూరు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న మద్యాన్ని, ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ వెంకటనారాయణ ఆదివారం తెలిపారు. అమడగూరు మండలంలోని మహమ్మదాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి కర్ణాటక నుంచి బైక్‌పై మద్యం తీసుకొని వస్తుండగా.. సంగీతంపల్లి గ్రామ శివారుల్లో అతన్ని పట్టుకోవడానికి యత్నించామన్నారు. అతను పోలీసులను చూసి కర్ణాటక మద్యం 960 హెవార్ట్స్ విస్కీ 90 ఎంఎల్ ప్యాకెట్లు, ద్విచక్రవానం వదిలి పారిపోయాడన్నారు. దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ రాధాక్రిష్ణ, సిబ్బంది విజయభాస్కర్, గంగాధర్ పాల్గొన్నారు.

### జూదరుల అరెస్ట్

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలోని కర్ణాటకనాగేపల్లి శివారు సమీపంలోని పేకాటస్థావరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఆరుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద ఉన్న రూ 1,51,500 స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. డ్రోన్ కెమెరాతో నిఘా వేసి.. దాడి చేసినట్లు చెప్పారు.

### ఆలయ ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

పుట్టపర్తి: స్థానిక శ్రీఆంజనేయ స్వామి ఆలయ ప్రహరీ నిర్మాణా నికి సత్యసాయిసెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ ఆదివారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కోటా సత్యం, కడియాల సుధాకర్, కత్తి రాజారెడ్డి, పీసీగంగన్న పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

## 25న ధ్వజస్తంభ ప్రతిష్ఠ


అలంకరణలో అయ్యస్వామి

మడకశిరటౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని 25వతేదీన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అదేరోజు అయ్యప్పస్వామి మండల పూజ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. 24వతేదీన సాయంత్రం గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశస్థాపన, జలదివాసం, క్షీరాదివాసం, 25న తెల్లవారుజామున 5 గంటలకు బ్రహ్మముహూర్తంలో కలశస్థాపన, ప్రాణ ప్రతిష్ఠాపన, నవగ్రహ హోమాలు, 7 నుంచి 10 గంటల వరకు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, శాంతిహోమం, మూర్తి హోమం, 10 గంటలకు అయ్యప్పస్వాములచే నెయ్యి అభిషేకం, కన్యస్వాములచే జ్యోతిపూజ, భజన కార్యక్రమాలు, ముత్యాలపల్లకి ఊరేగింపు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## అయ్యప్పస్వామి మండల పూజ


అయ్యప్పస్వామికి పూజలు చేస్తున్న మాలధారులు

గోరంట్ల, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దామరఒడ్డు అయ్యప్పస్వామి ఆలయంలో 16వ మండలపూజను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పురోహితులు మేఘనాథ్ శర్మ, గురుస్వామి రుషేంద్ర ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు గణపతి హోమం, మండలపూజలు, పూర్ణాహుతి, భజనలు, అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రాత్రి పల్లకీపై అయ్యప్ప ఉత్సవవిగ్రహాన్ని ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. మంగళవాయిద్యాల నడుమ చిన్నారుల జ్యోతుల ప్రదర్శనతో మాలధారులు కీర్తనలు, నృత్యాలు కనువిందు చేశాయి.

## సిద్దేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


అలంకరణలో సిద్దేశ్వరస్వామి

అమరాపురం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హేమావతి గ్రామంలో వెలసిన హెంజేరు సిద్దేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి వివిధ అభిషేకాలు, కుంకుమార్చన, రుద్రాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి వెండి కవచాలు ధరించి మహా మంగళహారతులు ఇచ్చి తీర్థప్రసాదం వినియోగం గావించారు. స్వామివారి ఆలయ ప్రాంగణంలో ఉన్న కాలభైరవేశ్వరస్వామి, దొడ్డేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు శివకుమార్, సిద్దలింగేశ్వర, ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ్ తెలిపారు.

## ఘనంగా కనకదాస జయంతి


గొరవయ్యల నృత్యం

పరిగి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కురుబల ఆరాధ్య దైవం కనకదాస జయంతిని మండలంలోని కాలువపల్లి, సుబ్బరాయనపల్లి గ్రామాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కనకదాస విగ్రహానికి పూలమాలలువేసి పూజలు చేశారు. మహిళలు జ్యోతులు మోసి కనకదాసకు సమర్పించారు. గొరవయ్యలు నృత్యాలతో కాలువపల్లి గ్రామంలో కనువిందు చేశారు. కనకదాస చిత్రపటంతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. మాజీ ఎంపీపీ సత్యనారాయణ, సర్పంచ్ సాకమ్మ, గిరి, ఎంపీటీసీ చిక్కన్న, టీడీపీ నాయకుడు బీరలింగ పాల్గొన్నారు.

## ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలి


టైలర్ల ఎంపిక ప్రక్రియలో కన్వీనర్లు

పెనుకొండ టౌన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళా తమ కుటుంబంలో ఆర్థికంగా భర్తకు చేదోడువాదోడుగా ఉండాలని పట్టణ కన్వీనర్లు సిద్దయ్య, శ్రీరాములు అన్నారు. ఆదివారం వివేకానంద జూనియర్ కళాశాలలో మంత్రి సవిత ఆధ్వర్యంలో ఐదు మండలాల్లో కుట్టుశిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉచిత కుట్టుశిక్షణకు అవసరమైన టైలర్ల ఎంపిక ప్రక్రియను వారు ప్రారంభించారు. మంత్రి సవిత ఆదేశాలతో ప్రతి మండలంలో 3 నెలలపాటు 300 మందికి కుట్టు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తయిన అనంతరం కుట్టుమిషన్లు కూడా అందిస్తామన్నారు.

### విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి

పెనుకొండ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రజలపై మోపిన విద్యుత్ అదనపు భారాన్ని ఉపసంహరించుకోవాలని పలు పార్టీల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. రాష్ట్రంలో ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులపై ట్రూఅప్ చార్జీల పేరుతో పెంచిన రూ.15,441 కోట్ల భారాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాటకు కట్టుబడి పెంచిన ట్రూఅప్ చార్జీలను విరమించాలన్నారు. సీపీఎం నాయకులు హరి, కాంగ్రెస్ నిస్సార్, సీఐటీయూ రమేష్, రైతు సంఘం ఫక్రుద్దీన్, బాబావలి, గంగాధర్, హర్ష, మహబూబ్‌బాషా, ఆరీఫ్, ఊతప్ప పాల్గొన్నారు.


సంతకాలు సేకరిస్తున్న వివిధ పార్టీల నాయకులు

# నెత్తురోడుతున్న జాతీయ రహదారి

- ఆరు నెలల వ్యవధిలో 15 మంది మృతి
- మలుపుల వద్దే ప్రమాదాలు
- కట్టడి పట్టని అధికారులు



రోడ్డు పక్కన ఉన్న లారీని ఢీ కొన్న టెంపో ట్రావెలర్

మడకశిర రూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నెత్తురోడుతోంది గ్రామాల మధ్య జాతీయ రహదారి ఉండటంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. హైవే అధికారులు, పెట్రోలింగ్ పోలీసులు అవగాహన కల్పించకపోవడంతో సమస్యగా మారింది. ఆరు నెలలో వ్యవధిలో 15 మంది మృత్యువాతపడ్డారు. కొడికొండ చెక్‌పోస్టు నుంచి శిర వరకు ఉన్న 544ఈ జాతీయ రహదారిలో ఎక్కువ మలుపులు ఉండడం, రహదారి గ్రామల మధ్యలో పోతుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. దీనికితోడు వాహనాలను వేగంగా నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. కేవలం 40 కి.మీ దూరంలోనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుండటం గమనార్హం.

**15మందిని బలిగొన్న ప్రమాదాలు**

యా రంగాపురం గ్రామం మధ్యలో రహదారి వెళ్తుండటంతో వృద్ధుడు రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆ గ్రామంలోనే ఓ ప్రైవేట్ ఉద్యోగి ద్విచక్రవాహనంలో వస్తుండగా లారీ ఢీకొని మృతి చెందాడు. అయ్యావారిపల్లి గ్రామం వద్ద జాతీయ రహదారిలో నాలుగు నెలల్లో రెండు ప్రమాదలు జరిగి ఇద్దరు మృతి చెందారు. ఈ రహదారిలో వేగంగా వస్తున్న కారు ఆటోను తప్పించబోయి ఘటనలో ఒకరు మృతిచెందారు. మరో ఘటనలో దాటుతున్న వ్యక్తిపై టెంపో దూసుకుపోవడంతో మృతిచెందాడు. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు.

**తరచూ మలుపుల వద్దే..**

తడకలపల్లి గ్రామం వద్ద మలుపు ఉండటంతో వాహనాలు వేగంగా వస్తూ అదుపు చేయలేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇదు నెలల వ్యవధిలో ఇద్దరు మృతిచెందారు. ఓ వృద్ధుడు ఎల్లోటి రోడ్డు నుంచి ద్విచక్రవాహనంలో వస్తుండగా వేగంగా వస్తున్న కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. తడకలపల్లి గ్రామ మలుపు వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు చెందారు. శనివారం ఉదయం బుళ్ళసముద్రం గ్రామం వద్ద రోడ్డు పక్కన నిలిచిన సిమెంట్ లారీని మినీ టెంపో ఢీకొన్న ప్రమాదంలో నలుగురు మృతిచెందారు. ఆదివారం మరో ఉపాధ్యాయురాలు మృతిచెందారు. ఈ ఘటనలో ఐదుగురు మృతిచెందారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు జాతీర రహదారిలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**పెట్రోలింగ్ పోలీసులు అప్రమత్తంగా ఉండాలి**



జాతీయ రహదారిలో ప్రమాదాలు జరగకుండా పెట్రోలింగ్ పోలీసులు అప్రమత్తంగా ఉండాలి. వాహనాలు నడిపేవారికి అవగాహన కల్పించాలి. అదే విధంగా ప్రతి 30 కి.మీలలో ఒక చెక్ పాయింట్‌ను ఏర్పాటుచేయాలి.

-మురళిబాబు, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధక్షుడు

# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కూటమి లక్ష్యం

- మంత్రి సవిత


అభివృద్ధి అంటే ఇదేనని చూపుతున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖల మంత్రి సవిత అన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామీణ రోడ్లు అధ్వానంగా మారాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గుంతలు పడ్డ రోడ్లను బాగు చేస్తున్నామని అన్నారు. ఆదివారం పెనుకొండ సమీపంలో జరుగుతున్న తారురోడ్డు పనులను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పెనుకొండలో ఫ్లైఓవర్ నుంచి కుంభకర్ణ ప్రాజెక్ట్ వరకు రూ.18కోట్ల నిధులతో తారు రోడ్డు పనులు మంజూరయ్యాయన్నారు. రోడ్డు పనులు చేస్తున్న కాంట్రాక్టర్లను నాణ్యమైన పనులు చేయించాలని ఆదేశించారు. వైసీపీ హయాంలో గుంతలుపడ్డ రోడ్డును కూటమి ప్రభుత్వం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు.

**భైరవేశ్వరస్వామి సన్నిధిలో మంత్రి, ఎంపీ**

గోరంట్ల: మండలంలోని పాపిరెడ్డిపల్లి కాళభైరవేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన శాంతి పూజల్లో మంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథి విడివిడిగా పాల్గొన్నారు. అనంతరం వారు మల్లాపల్లి టీడీపీనాయకుడు స్టోర్ డీలర్ శ్రీధర్ వైకుంఠ సమారాధన కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం ఎర్రబల్లికి చెందిన సోమలింగారెడ్డి అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటుండగా మంత్రి ఆయన ఇంటికెళ్లి పలకరించారు. బూదిలి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త చాకలి సురేష్ ద్విచక్రవాహన ప్రమాదంలో గాయపడి, చికిత్సఅనంతరం విశ్రాంతి తీసుకుంటుండగా మంత్రి పరామర్శించి రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. అలాగే గౌనివారిపల్లి మాజీ ఎంపీటీసీ నాగభూషణ కుటుంబ సభ్యులు మృతిచెందడంతో ఆమె వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. కన్వీనర్ సోముశేఖర్, కొత్తపల్లి నరసింహప్ప, పచ్చా అశోక్, సుధాకర్‌రెడ్డి, బాలక్రిష్ణ, వెంకటరెడ్డి, మహమ్మద్, నీలకంఠ, ఆదినారాయణ, రవి, బ్రహ్మాచారి పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న ఎంపీ బీకే పార్థసారథి, టీడీపీ నాయకులు

## రోడ్డు ప్రమాదంలో వీఆర్‌ఏకు గాయాలు

గోరంట్ల, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పుట్టపర్తి రహదారి ఖాజాపురం సమీపంలో ఆదివారం ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో వీఆర్‌ఏ కాలభైరవుడు తీవ్రంగా గాయపడ్డారు. కొత్తచెరువు మండలంలోని లోచర్ల గ్రామానికి చెందిన కాలభైరవుడు ద్విచక్రవాహనంపై గోరంట్లకు వచ్చి పనిముగించుకుని, తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. హైవే విస్తరణ పనులు జరుగుతుండగా, ఖాజాపురం వద్ద ద్విచక్ర వాహనం ప్రమాదానికి గురికాగా, వీఆర్‌ఏ తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమచికిత్స అనంతరం 108లో మెరుగైన వైద్యం కోసం హిందూపురం ఆసుపత్రికి తరలించారు.

## చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

గోరంట్ల, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి మండలంలోని పెడబల్లి తండాకు చెందిన విద్యార్థి రాజేష్‌నాయక్ (13) రోడ్డు ప్రమాదంలో గాయపడి హిందూపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. పెడబల్లికి చెందిన మహేష్‌నాయక్, రాజేష్‌నాయక్‌లు 18వ తేదీన ద్విచక్రవాహనంలో గోరంట్లకు వచ్చి తిరుగు ప్రయాణంలో గుంతపల్లి గార్మెంట్స్ పరిశ్రమ వద్ద కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో మహేష్‌నాయక్ (23) అక్కడికక్కడే మృతిచెందిన విషయం తెలిసిందే. పెడబల్లి ఉన్నతపాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రాజేష్‌నాయక్ తీవ్రంగా గాయపడి, బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఆర్థిక ఇబ్బందులతో హిందూపురం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు సీఐ శేఖర్ తెలిపారు. రాజేష్‌నాయక్ తండ్రి గోపేనాయక్ కొంతకాలం క్రితం మృతిచెందగా, తల్లి కుమారుడు, కూతురిని పోషిస్తోంది. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## కర్ణాటక మద్యం అమ్మితే చర్యలు

అగళి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో కర్ణాటక మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వీరేష్ హెచ్చరించారు. కర్ణాటక ప్రాంతం బొమ్మరసనపల్లి గేటు, పి. బ్యాడిగెర, నందరాజనపల్లి, ఆలూడి గ్రామాలకు సరిహద్దులో కర్ణాటక మద్యం షాపులున్నాయన్నారు. అక్కడి నుంచి అగళి మండలానికి ఎవరైనా మద్యం తెచ్చి విక్రయిస్తే జైలుకు పంపుతామన్నారు. ఆంధ్రలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయిస్తున్నారన్నారు. అలాగే మట్కా, గుట్కా, గంజాయి, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పలు గ్రామాలలో ఎస్ఐ పర్యటించారు. ఏఎస్ఐలు బషీర్, శ్రీరాములు, సిబ్బంది పాల్గొన్నారు.

## పెట్రోల్ బంకు తనిఖీ



పెట్రోల్ కొలతను పరిశీలిస్తున్న అధికారులు

హిందూపురం అర్బన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో మణి పెట్రోల్ బంకును ఆదివారం తూనికలు, కొలతల శాఖ అధికారి శంకర్, సీఎస్ డీటీ ఆరతి తనిఖీ చేశారు. పెట్రోల్ బంకులో కొలతలు తక్కువగా వస్తున్నాయని ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయని, దీంతో తనిఖీ చేశామని వారు తెలిపారు. కొలతలలో తేడా కనిపించలేనది వారు అన్నారు.

## మందుల దుకాణంపై దాడి

హిందూపురం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పరిగిరోడ్డులో ఉన్న మందుల దుకాణంపై డీఎస్పీ మహేష్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ హనుమయ్య దాడులు చేశారు. మెడికల్ షాపులో మత్తువచ్చే మాత్రలు వైద్యుల అనుమతి లేకుండా విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దీంతో 1940 డ్రగ్స్ యాక్ట్ ప్రకారం కాస్మెటిక్స్ చట్టానికి విరుద్ధంగా అమ్మకాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. మెడికల్ షాపుపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఘనంగా గణిత దినోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రతాప్

గుడిబండ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలికల గురుకుల కళాశాలలో ఆదివారం ప్రిన్సిపాల్ ప్రతాప్ ఆధ్వర్యంలో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అతని అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడవాలని పిలుపునిచ్చారు. అనంతరం కేక్ కట్‌చేసి స్వీట్లను పంచిపెట్టారు. విద్యార్థులచే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ లలిత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫుట్‌బాల్ పోటీల్లో హిందూపురం జట్టు గెలుపు



గెలుపొందిన ట్రోఫీతో హిందూపురం ఫుట్‌బాల్ జట్టు

హిందూపురం అర్బన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో ఆదివారం జరిగిన రూరల్ ఫుట్‌బాల్ అండర్-12 బాలుర సూపర్ లీగ్ పోటీల్లో హిందూపురం జట్టు మొదటి స్థానంలో నిలిచింది. హిందూపురం, కళ్యాణదుర్గం క్రీడాకారులు తలపడగా కళ్యాణదుర్గంపై 5-0 గోల్స్‌తో విజయం సాధించింది. అలాగే ధర్మవరం, గుత్తి జట్లు తలపడగా ధర్మవరం 2-0 గోల్స్‌తో ధర్మవరం రెండో స్థానంలో నిలిచింది. గుత్తి మూడోస్థానానికి పరిమితమైంది. హిందూపురం యునైటెడ్ ఫుట్‌బాల్‌క్లబ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. శేఖర్ ప్రతిభా క్రీడాకారులను, కోచ్ మహ్మద్‌సలీమ్, యోగవర్దన్‌రెడ్డిలను అభినందించారు.

# టీడీపీ పాలనలోనే ఉపాధ్యాయ ఉద్యోగాలు

- మంత్రి సవితకు రుణపడి ఉంటాం: ఏపీడబ్ల్యూఎస్ఓ

పెనుకొండ టౌన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రభుత్వ పాలనలోనే అధికంగా ఉపాధ్యాయ ఉద్యోగాలు వచ్చాయని సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖాధికారి గంగాధర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని వివేకానంద జూనియర్ కళాశాలలో డీఎస్సీ ఉచిత శిక్షణ ముగింపు సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 60 రోజులపాటు డీఎస్సీ ఉచిత కోచింగ్ సెంటర్‌ను నిర్వహించామన్నారు. దాదాపు 300 మంది అభ్యర్థులు సద్వినియోగం చేసుకున్నారన్నారు. 60రోజులు సరిపోకపోవడంతో మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లగా మరో 15 రోజులు పొడిగించారన్నారు. డీఎస్సీ కోచింగ్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకున్న అభ్యర్థులు మాట్లాడుతూ మంత్రి సవితకు రుణపడి ఉంటామని అన్నారు. ఒక కోచింగ్ నిర్వహణేకాకుండా సొంత డబ్బుతో భోజన సదుపాయం కూడా ఏర్పాటు చేశారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నామని, వచ్చే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి మంత్రికి మంచిపేరు తీసుకొస్తామన్నారు. కన్వీనర్లు సిద్దయ్య, శ్రీరాములు, చంద్రకాంతమ్మ, అనసూయ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏపీడబ్ల్యూఎస్ఓ గంగాధర్


వైసీపీ సర్పంచ్ నాగమూర్తికి టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి

## అభివృద్ధిని చూసే టీడీపీలోకి..

- మంత్రి సమక్షంలో పార్టీలో చేరిన వైసీపీ మద్దతు సర్పంచ్

పెనుకొండ టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే గ్రామ పంచాయతీల అభివృద్ధి అని, అందుకే వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నానని సర్పంచ్ నాగమూర్తి తెలిపారు. ఆదివారం స్థానిక అన్నక్యాంటీన్‌లో కియా ఇండస్ట్రియల్ ఏరియా యర్రమంచి పంచాయతీ సర్పంచ్ నాగమూర్తి మంత్రి సవిత సమక్షంలో ఆయన అనుచరులతో కలిసి వైసీపీని వీడి టీడీపీ కండువా కప్పుకున్నారు. మంత్రి మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో గ్రామ పంచాయతీలను నిర్వీర్యంచేసి నిధులను దారి మళ్లించిన నాయకుడు జగన్మోహన్‌రెడ్డి అని దుయ్యబట్టారు. పార్టీలో చేరినవారిలో సర్పంచ్ నాగమూర్తి, చంద్రాయుడు, కేశవయ్య, రామాంజి, కేశప్ప, రామాంజనేయులు, కొండయ్య, లక్ష్మీనారాయణ, మారెప్ప పార్టీలోనే చేరినవారిలో ఉన్నారు.

**పేదల పాలిట అన్నక్యాంటీన్ వరం:** నిరుపేదల పాలిట అన్నక్యాంటీన్ ఓ వరమని బీసీ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత అన్నారు. ఆదివారం అన్నక్యాంటీన్ వద్ద ఆమె పేదలకు అన్నం వడ్డించారు. మంత్రి మాట్లాడుతూ నిరుపేదలకు కడుపునింపడమే మా ధ్యేయమని అన్నారు. సీఎం చంద్రబాబు ఆచరణలో భాగంగా నేటికి 551రోజులు పూర్తి చేశామన్నారు. నిరంతరాయంగా అన్న క్యాంటీన్‌ను కొనసాగిస్తామన్నారు. మావటూరు గోపాల్, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

**ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు:** పట్టణంలోని పురాతన సీఅండ్ఐజీ మిషన్‌చర్చిలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఆదివారం మంత్రి సవిత వేడుకల్లో పాల్గొన్నారు. చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. క్రిస్మస్ తాత వేషధారణలతో ఆకట్టుకున్నారు. కేక్‌కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు.

## లేపాక్షి ఆలయాన్ని సందర్శించిన ఆర్పీ పట్నాయక్


ఆలయ విశిష్టతను తెలుసుకుంటున్న ఆర్పీ పట్నాయక్, కుటుంబ సభ్యులు

లేపాక్షి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధిచెందిన లేపాక్షి దుర్గా వీరభద్రస్వామి ఆలయాన్ని ఆదివారం తెలుగు సినిమా సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఆలయంలోని ఏడు శిరస్సుల నాగేంద్రుడు, అర్థాంతరంగా ఆగిన కల్యాణమండపం, సీతాదేవిపాదం, నాట్యమండపం, వేలాడే స్తంభాన్ని సందర్శించి సంతోషం వ్యక్తం చేశారు. ఆలయ చరిత్రను గైడ్ రఘు వివరించారు. దుర్గా, వీరభద్రస్వాములకు అర్చకులు శ్రీనివాసరావు, నరసింహశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం ఆలయ సిబ్బంది వారిని దుశ్శాలువతో సన్మానించారు. ఆలయంలోని శిల్ప, చిత్రకళలు అద్భుతంగా ఉన్నాయని అయన అన్నారు.

## దానం చేయడంలోనే ఆనందం


వృద్ధులకు దుప్పట్లు అందజేస్తున్న భారతీ శ్రీనివాసులు

హిందూపురం అర్బన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దానం చేయడంలోనే ఆనందం ఉందని టీడీపీ కౌన్సిలర్ డీఈ రమేష్‌కుమార్ అన్నారు. ఆదివారం పట్టపరిధిలోని పాంచజన్య పాఠశాల యాజమాని భారతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వస్త్ర వందన కార్యక్రమానికి అయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ శ్రీనివాసులు గత కొంత కాలం నుంచి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. పేదలకు ఉచిత మందులు, ఆసుపత్రి సదుపాయం, పేద విద్యార్థులకు విద్యాదానం, ఉచితంగా పుస్తకాల పంపిణీ తదితర కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఇందులో భాగంగా 350 మంది వృద్ధులకు దుప్పట్లు, చీరలు అందించారన్నారు. మాజీ వైస్ చైర్మన్ జేపీకే రాము, నందకుమార్, భాస్కర్, విజయేంద్ర, పాంచజన్య పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ముస్లిం యువత అన్నిరంగాల్లో రాణించాలి


ముస్లిం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఖలందర్‌తో యువకులు

అమరాపురం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ముస్లిం యువత అన్ని రంగాల్లో ముందుండాలని ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఖలందర్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముస్లిం యువత కేవలం చేతి వృత్తులకే పరిమితం కాకుండా మంచి విద్యను అభ్యసించి ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలన్నారు. పాఠశాలకు దూరంగా ఉన్న ముస్లిం పిల్లలకు విద్య గొప్పతనాన్ని తెలియజేసి, వారు చదువుకొనేందుకు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో హిదాయత్, షబ్బీర్, రాహిత్, బాబాఫకృద్దీన్, ఇబ్రహీం, సాదిక్, దాదాపీర్, తాహీర్ పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

లేపాక్షి, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక జవహర్ నవోదయ పాఠశాలలో 2005-06లో పతో తరగతి చదివిన పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. అప్పట్లో విద్యనేర్పిన గురువులను ముఖ్య అతిథులుగా ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. మల్టీ పర్పస్ హాల్‌ను పునరుద్ధరించి రూ.10లక్షలతో జీఎల్ షీటు ఏర్పాటు చేశారు. అనంతరం ఇందుకు సంబంధించిన శిలాఫలకాన్ని విశ్రాంత ప్రిన్సిపాల్ బయప్పరెడ్డి ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ అందరికీ ఆదర్శంగా ఉంటూ మంచి భవిష్యత్తును సాధించాలన్నారు. ఉన్నత స్థానాలలో స్థిరపడి పలువురికి ఆదర్శంగా నిలిచారన్నారు. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు వారిని ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు పాఠశాల సిబ్బందిని సన్మానించారు. ప్రిన్సిపాల్ నాగరాజు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.